క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మంచినీటి బోరుకు కొత్త పంపు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, తదితరులు

ద్వారకాతిరుమల: స్థానిక వసంత్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం మంచినీటి బోరుకు కొత్త పంపును ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, మొగతడకల ఓం ప్రకాష్, పంచాయతీ వార్డు సభ్యుడు పాకనాటి శేషు తదితరులు బోరు వద్ద కొబ్బరికాయలు కొట్టి, పంపు నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే కాలనీ ప్రజలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందించారు.

వాహనాల వేలం

జంగారెడ్డిగూడెం: ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన 33 మోటార్‌సైకిళ్లను బుధవారం వేలం వేశారు. ఏలూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ మాట్లాడుతూ మొత్తం 33 వాహనాలకు ప్రభుత్వ ధరగా రూ.4,16,000 నిర్ణయించడం జరిగిందన్నారు. వేలంలో వాహనాలను పాటదారులు రూ. 6,82,158 పాడుకోవడం జరిగిందన్నారు. జీఎస్టీ 1,04,058 పోను లాభం రూ.1,62,100 వచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే స్టేషన్ ఆవరణలో వివిధ నేరాలలో పట్టుబడిన 642 లీటర్ల నాటుసారా, 328 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వై.పట్టాభిచౌదరి, ఎస్సై సీహెచ్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి గోశాలలో 65 గోవులకు వైద్య పరీక్షలు



గోసంరక్షణశాలలో గోవుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యాధికారి

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణశాలలోని గోవులకు మంగళ, బుధవారాల్లో వైద్య పరీక్షలను నిర్వహించారు. అందులో 65 ఆవులకు మండల పశువైద్యాధికారి అంగర సురేష్ గర్భకోశ వ్యాధుల పరీక్షలు, చూడి నిర్ధారణ పరీక్షలను జరిపారు. అలాగే అన్ని ఆవులకు గొంతు వాపు వ్యాధి టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో గోసంరక్షణశాల ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ కిషోర్, గుమస్తాలు కోదండ రామాచార్యులు, రామకృష్ణ, రామిరెడ్డి తదితరులున్నారు.

అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో పలువురు దాతల సహకారంతో బుధవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సుమారు 1300 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కొమ్మసాని రవీందర్‌రెడ్డి, కల్లూరి మురళీకృష్ణ, చల్లా వరప్రసాద్, శీదరాల శ్రీనివాస వెంకట గంగాధరర్, చెన్నూరు శివాజీకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల విద్యార్థుల సంఖ్య పెంచాలి

చింతలపూడి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచించారు. బుధవారం చింతలపూడి క్యాంప్ కార్యాలయంలో ఆయన డీవైఈవో ప్రభాకర్ రావుతో ఇంటర్ కళాశాలల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం, తరగతి గదులు, అధ్యాపకుల సంఖ్య తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి కళాశాలల మెరుగైన నిర్వహణ కోసం తీసుకోవలసిన చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు శోచనీయం

టి.నరసాపురం: గ్రామీణ ప్రాంతాల ప్రజలు సోమరిపోతులు అని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడడం శోచనీయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నిరీక్షణరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిరంతరం చెమటోడ్చి కష్టపడి జీవించే కష్టజీవులన్నారు. పగలంతా వ్యవసాయ పనులు, కూలీపనులు చేసుకొని జీవిస్తుంటారన్నారు. స్వాభిమానంతో జీవించే గ్రామీణులను కించపరిచిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు గ్రామీణ ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములను పేదలకు పంచాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి



జెండా పాతి భూపోరాటాన్ని ప్రారంభించిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి

టి.నరసాపురం: ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములను పేదలకు పంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో మిగులు భూములు స్వాధీనం చేసుకునే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి భూమిలో పాతి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములను పేదలకు పంచాలని గత 8 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. లంచాలు మింగి భూస్వాములకే ఈ భూములను కట్టబెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. చట్ట విరుద్ధంగా, చట్టాన్ని ధిక్కరిస్తూ భూములను భూస్వాములకు ఏ విధంగా కట్టబెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి లాభాలు పొంది తర్వాత ప్రభుత్వ భూములు తమవే అనడం దుర్మార్గం అన్నారు. నాటి ప్రభుత్వం రిజర్వాయర్ కోసం సేకరించిన భూములకు అప్పటి రేటు కేటాయించి రైతులకు, భూస్వాములకు పూర్తిస్థాయి పరిహారం ఇచ్చిందని తెలిపారు. కానీ పరిహారం పొందిన వాళ్లే నేడు భూములను సాగు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికే భూమిలేని దళితులు, గిరిజనులు ఇతర కులాల్లోని పేదలకు ఈ భూములు అప్పజెప్పాలని కోరారు. వారికీ ఎక్స్ఎల్ పట్టాలు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. పోలవరం, చింతలపూడి ఎమ్మెల్యేలు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి రామకృష్ణ వ్యవసాయ కూలీల సమస్యలు, పేదలు ఇబ్బందులు పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తామా ముత్యాలమ్మ, మండపం సుధారాణి, జిల్లా కమిటీ సభ్యులు యాగంటి సీత, అనుమోలు మురళి, గంగాభవాని, రామలక్ష్మి, చెల్లమ్మ, రాజు, సిద్ధు, మరో వంద మంది పేదలు దళితులు, గిరిజనులు పాల్గొన్నారు.

ఐటీడీఏను సందర్శించిన కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

బుట్టాయగూడెం: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె. వెట్రి సెల్వి బుధవారం మొదటిసారిగా కేఆర్‌పురం ఐటీడీఏను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు స్వాగతం పలికారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులను ఆమె పరిచయం చేసుకున్నారు. త్వరలోనే మళ్లీ ఐటీడీఏకు వస్తానని ఆ సమయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ పీవీఎస్ నాయుడు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ కేవీఎస్ఎస్ కుమార్, వెలుగు ఏపీడీ ఎన్.నాగేశ్వరరావు, ఐటీడీఏ డీవైఈఓ నీలయ్య, జీసీసీ అకౌంటెంట్ సీహెచ్ రాజయోగి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: నీటి పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థి సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) నాయకులు కోరారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి యువజన సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈమేరకు కరపత్రాన్ని విడుదల చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని, తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో, బాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారన్నారు. నీట్ పరీక్షా పేపర్ లీకేజ్ తెరవెనుక కుంభకోణం, నీట్- పీజీ పరీక్షను 12గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహిచంచి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్టీఏ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని తదితర డిమాండ్‌లతో బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నవలం మోహన్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము పంపిణీలో అవకతవకలపై ఆరోపణలు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో ఈనెల 1, 2 తేదీల్లో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.లక్ష మేర పింఛన్ సొమ్మును వీఆర్వో స్వాహా చేయడంతో, ఆ సొమ్మును ఆమె వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి వెంకటేశ్వరరావు తన బంగారాన్ని తాకట్టుపెట్టి మరీ లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం. పంగిడిగూడెం గ్రామంలో 56 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేసే బాధ్యతను అధికారులు ఆ గ్రామ వీఆర్వో చంద్రలీలకు అప్పగించారు. తొలిరోజు ఆమె 39 మందికి పింఛన్లను అందించారు. మరుసటి రోజు మధ్యాహ్న సమయానికి నలుగురికి పంపిణీ చేశారు. దీంతో మిగిలిన 17 మంది లబ్ధిదారులు తమకు పింఛన్ అందలేదని గగ్గోలు పెట్టడంతో ఆ సొమ్మును వీఆర్వో స్వాహా చేశారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. దాంతో ఆ రోజు మధ్యాహ్నం డిప్యూటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మి పంగిడిగూడెం గ్రామానికి వెళ్లి వీఆర్వోతో, లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అయితే కొద్దిసేపటికి మిగిలిన 13 మంది లబ్ధిదారులకు వీఆర్వో పింఛన్ సొమ్ము రూ.89 వేలను అందించారు. దాంతో పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ జరిగినట్టు అధికారులు తేల్చారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మి వివరణ ఇస్తూ పంగిడిగూడెంలో వీఆర్వో చంద్రలీల పింఛన్ల సొమ్ము స్వాహా చేసినట్టు ఆరోపణలు వచ్చాయని, వెంటనే తాను విచారణ జరిపినట్టు తెలిపారు. అయితే సకాలంలోనే ఆమె లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేసినట్లు చెప్పారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



సీఎస్‌టీఎస్ కళాశాలలో మొక్కను నాటుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వనమహోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ చెట్లు లేకపోతే మానవ మనుగడ కష్టసాధ్యమన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఇప్పటికే క్లోరో ఫ్లోరో కార్బన్ ప్రభావం వల్ల ఓజోన్ పొర దెబ్బతినడం జరుగుతుందని, దాన్ని కొంతవరకైనా అరికట్టాలంటే చెట్లను విరివిగా పెంచాలన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 కోఆర్డినేటర్ నిట్టా వినయ్, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 కోఆర్డినేటర్ డా. జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చెట్లను పెంచడం వల్ల నిరంతరం జీవులకు కావలసినటువంటి ఆక్సిజన్ సమృద్ధిగా లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ స్థానిక వైఎంహెచ్ఏ హాలులో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీలను నగరానికి చెందిన హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ), హేలాపురి కళాపరిషత్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయా కమిటీల సభ్యులు తెలిపారు. ఈ నాటిక పోటీల్లో ఆయా నాటక కళా సమాజాలచే ఏడు నాటికలు ప్రదర్శించబడతాయన్నారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం ప్రారంభ సభతో పోటీలు ప్రారంభమై కళానికేతన్, వీరన్నపాలెం వారిచే 'రాజుగారి గోచి' నాటిక రాత్రి 8 గంటలకు అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారిచే అమృత హస్తం నాటిక ప్రదర్శిస్తారన్నారు. శుక్రవారం వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారిచే 'రాత' నాటిక, కళావర్షిని ద్రోణాదుల వారిచే 'అజరామరం' నాటిక, శనివారం అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే 'ఇంద్రప్రస్థం' నాటిక, శ్రీ కృష్ణ ఆర్ట్స్ తెలుగు థియేటర్స్ గుడివాడ వారిచే 'మళ్లీ కలిసి జీవిద్దాం' నాటిక ప్రదర్శిస్తారన్నారు. ఉత్సవాల ముగింపు రోజైన ఆదివారం శ్రీ సాయి ఆర్ట్స్, కొలకలూరి వారిచే 'కౌసల్య సుప్రజా రామా' నాటిక ప్రదర్శిస్తారన్నారు. అదే రోజు విజేతలను ప్రకటించి బహుమతి ప్రదాన సభ నిర్వహిస్తామన్నారు. అలానే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రదర్శనలుగా వీ. రామాంజనేయులు గారితో మయసభ ఏకపాత్ర , పీ. విజయ్ కుమార్, బీ గంగారావు 'రామభక్త హనుమాన్' పద్య నాటకం, మండవ రాజగోపాలకృష్ణ 'శంబరాసూర' ఏకపాత్ర ప్రత్యేక ప్రదర్శనలుగా ఏర్పాటు చేశామన్నారు. ఈ నాటికల పోటీలను నగర ప్రజలు వీక్షించి ఆదరించాలని కోరారు.

అధిక దిగుబడినిచ్చే వరి రకాలను సాగుచేయాలి



వరి నారుమడులను పరిశీలిస్తున్న, వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు

కామవరపుకోట: అధిక దిగుబడినిచ్చే వరి రకాలను సాగు చేసి రైతులు లాభాలను పొందాలని గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు లలిత సుధా అన్నారు. రావికంపాడు గ్రామంలో ఏరువాక కార్యక్రమంలో భాగంగా వరిలో సమగ్ర యాజమాన్యంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డా. కె.ఫణికుమార్ వరిలో నారుమడి యాజమాన్యం పద్ధతుల గురించి, ప్రధాన పొలంలో కలుపు యాజమాన్యం గురించి వివరించారు. వరి సాగులో రైతులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. వ్యవసాయ శాఖ వ్యవసాయ సహాయ సంచాలకులు లలిత సుధ, మండల వ్యవసాయ అధికారి సి.పవన్‌కుమార్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచలను పాటించి సార్వాసాగుకు అనువైన అధిక దిగుబడినిచ్చే వరి రకాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామ సమీపంలోని వరి నారుమడులను సందర్శించి కలుపు సమస్యకు కలుపు నివారణ మందులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎన్. నాగేంద్రబాబు, వీఏఏ ఎన్.వెన్నెల, రైతులు పాల్గొన్నారు.

వరిలో సమగ్ర యాజమాన్యంపై అవగాహన



సమ్మెటవారిగూడెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చింతలపూడి: నేరుగా వెదజల్లే పద్ధతిలో వరిలో సమగ్ర యాజమాన్యంపై బుధవారం గుంటూరు ఎన్జీరంగా విశ్వవిద్యాలయం పరిధిలోని ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సమ్మెట వారిగూడెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డా. కె.ఫణికుమార్, శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు మాట్లాడుతూ నేరుగా వెదజల్లే వరిలో కలుపు, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు లలిత సుధ మాట్లాడుతూ రైతులు నేరుగా వెదజల్లే వరి సాగులో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మీనా, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



దివ్యాంగులకు బియ్యం అందజేస్తున్న సీఐ బీబీ రవికుమార్, ఎస్సై సుధాకర్

భీమడోలు: దివ్యాంగుల్లో అసాధారణ స్వాభావిక ప్రతిభ ఉంటుందని, వారంతా అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. గుండుగొలను విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఇటీవల జరిగిన పదో పరీక్షల్లో ప్రతిభను చాటిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల్లోని ప్రతిభను పెంపొందించుకోవడంతో పాటు వారి వికాసానికి వేదిక కావాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన దాత మంతెన సూర్యనారాయణరాజు ఆర్థిక సాయంతో 60 మంది దివ్యాంగులకు సన్నబియ్యం, పళ్లు, పౌష్టికాహారాన్ని అందజేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన స్వర్గీయ దాట్ల సూరపరాజు జ్ఞాపకార్థం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభను చాటిన ముగ్గురికి నగదు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్, జిల్లా దివ్యాంగుల పోరాట సమితి అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, పాఠశాల ప్రతినిధులు గేదెల సురేష్, నిర్వాహకులు దాట్ల కృష్ణంరాజు, సీతారామరాజు, పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, ఏ.సోములు, రావి గంగరాజు, కర్రి గంగాధరరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి ప్రథమ చికిత్సా కేంద్రానికి మందుల అందజేత



శ్రీవారి దేవస్థానం డీఈఓ బాబురావుకు మందులను అందజేస్తున్న దాతలు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం ప్రాణదాన ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన శ్రీశైల భక్తాసేవా సమితి అధ్యక్షుడు ఏవీ సుబ్బయ్య, పి.గోవర్ధన్, కేవీఎన్ గుప్తా వారసుల సహాయంతో నాలుగు వేల మంది భక్తులకు సరిపడా మందులను బుధవారం ఉచితంగా అందజేశారు. వీటిని శ్రీశైల భక్తాసేవా సమితి మెడికల్ ఇన్‌చార్జి ఎం.పూర్ణచంద్రరావు, ఏవీ సాంబశివరావుల చేతులు మీదుగా చినవెంకన్న దేవస్థానం డీఈఓ బాబురావు, ప్రథమ చికిత్సా కేంద్రం వైద్యుడు రాజేంద్ర ప్రసాద్‌లకు అందించారు. ఈ మందులను కాలినడక భక్తులకు వినియోగించాలని దాతలు కోరారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం దుర్గాప్రసాద్, రాధా, చిన్నారి తదితరులున్నారు.

ఎస్టీమ్ పవర్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు

దెందులూరు: విద్యుత్ వినియోగదారులందరూ ఇకపై గూగుల్‌ప్లే స్టోర్ నుండి ఎస్టీమ్ పవర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యుత్ శాఖ దెందులూరు ఏడీఈ త్రీవాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొబైల్‌లో డిస్కం వెబ్‌సైట్ ద్వారా తమ విద్యుత్ బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎస్టీమ్ పవర్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపుపై గ్రామాల్లో ఏఈలు, లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు పూర్తిస్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఏడీఈ త్రీవాస్ సూచించారు.

ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ అధ్యక్షుడు కురమా ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం ఏపీటీఎఫ్ నగర శాఖ సమావేశం నిర్వహించారు.ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఉన్నందున ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. అప్పటివరకూ విద్యార్థులకు నష్టం జరుగకుండా ఉపాధ్యాయులకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలన్నారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు తొమ్మండ్రు ప్రకాశరావు మాట్లాడుతూ జీఓ 117ను తక్షణమే రద్దు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని కోరారు. జిల్లా కౌన్సిలర్ చింతా వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఇవ్వబోయే తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపచేయడం ద్వారా ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియంను సమాంతరంగా నిర్వహించాలని కోరారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మహిళా వేధింపుల నివారణ చట్టం అమలుపై సమావేశం

ఏలూరు (టూటౌన్): మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం అమలుపై గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి కేవీఎల్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు, నోడల్ అధికారులు, ప్రజలు హాజరుకావాలని ఆమె కోరారు.

సదరం సర్టిఫికెట్ల స్లాట్‌ల విడుదల

దెందులూరు: దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొందేందుకు జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి స్లాట్లను ప్రభుత్వం విడుదల చేసిందని దెందులూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్టిఫికెట్ కోసం గురువారం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గొంతువాపు వ్యాధికి వ్యాక్సిన్లు వేయించాలి



పచ్చిక మేస్తున్న పశువులు

బుట్టాయగూడెం: తొలకరి ప్రారంభమై గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంట చేలల్లో పచ్చిక పెరుగుతుంది. ఈ పచ్చికను పశువులు తినడంతో గొంతువాపు వచ్చే అవకాశం ఉంటుంది. ఫ్యాశ్చురల్లా మల్టోసిడా అనే బాక్టీరియా కారణంగా ఈ గొంతువాపు పశువులకు సోకుతుంది. దీని ప్రభావం తీవ్రమైతే పశువులు మృత్యువాత పడే అవకాశం ఉందని పశువైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

సకాలంలో వ్యాధి గుర్తించకపోతే ప్రమాదం

గిరిజన ప్రాంతాల్లో అధికంగా ప్రజలు పాడి రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. గిరిజన మండలాల్లో దాదాపు 1,61,730 పశువులు ఉన్నాయి. అన్ని రకాల పశువులకు గొంతువాపు వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయి. పశువుకు 104 డిగ్రీల పైబడి అధిక జ్వరం రావడం జరుగుతుంది. సకాలంలో గుర్తించకపోతే వారం రోజుల్లోనే పశువు మరణించే అవకాశం ఉందని పశువైద్యాధికారులు చెప్తున్నారు. బలమైన పశువుల కంటే దూడలకు ఈ వ్యాధి త్వరగా సోకే ప్రమాదం ఉందని అంటున్నారు. వ్యాధిరాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హిమరైజిక్ సెప్టీసెమియా(ఎహెచ్ఎస్) అనే వ్యాక్సిన్‌తో నివారించవచ్చని డాక్టర్లు చెప్తున్నారు.

పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్నాం



పసిరిక మేతతో పశువుల్లో గొంతువాపు వ్యాధి రాకుండా ముందస్తు వ్యాక్సిన్‌లను వేస్తున్నాం. ఏజెన్సీ గిరిజన మండలాల్లో ఇప్పటివరకూ 17,913 పశువులకు వ్యాక్సిన్‌లు వేయడం జరిగింది. మిగిలిన పశువులకు కూడా వ్యాక్సిన్లు పూర్తి చేసే విధంగా కృషి చేస్తున్నాం.

– డాక్టర్ మల్లంపల్లి సాయిబుచ్చారావు, ప్రాంతీయ పశువర్థక శాఖ సహాయ సంచాలకులు, జీలుగుమిల్లి